# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంపుటి : 3 | సంచిక : 301 | శనివారం 14 మార్చి 2026 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



News Portal Designing
Epaper Designing & Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com




## కాంగ్రెస్ విదేశీ శక్తుల కీలుబొమ్మ

- ప్రధాని నరేంద్ర మోదీ
- 'ప్రస్తుతం ప్రపంచమంతటా యుద్ధ వాతావరణం నెలకొంది
- ఇటువంటి క్లిష్ట సమయంలో దేశ ప్రజలపై ఆ ప్రభావం పడకుండా తమ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది
- అయితే బాధ్యతాయుతమైన రాజకీయ పక్షంగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్.. దేశంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది



## పంజాబ్ ప్రభుత్వం కేజ్రీవాల్‌కు ఏటీఏంలా మారిపోయింది

- భగవంత్ మాన్ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు
- పంజాబ్ అప్పులు, మాదకద్రవ్యాలు, మత మార్పిడులు, అవినీతికి నిలయంగా మారిందంటూ ఘాటు వ్యాఖ్యలు
- "ఈ ప్రభుత్వంలో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా ఉంది
- 2026లో ముగ్గురు గ్రామ సర్పంచులు హత్యకు గురయ్యారు

## అడగడుగునా అడ్డంకులు... ముందుకు సాగేదెలా

- 500 మంది నిపుణులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఈ ప్రాజెక్టు భవితవ్యాన్ని నిర్ణయించబోయే ఒక కీలక మలుపు
- బాధితుల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు నేరుగా ముఖ్యమంత్రే హామీ ఇస్తున్నారు అనే నమ్మకాన్ని కలిగించడం దీని ప్రధాన ఉద్దేశం
- సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టుల వివరణను అధికారులు లేదా కన్సల్టెంట్లు ఇస్తారు
- కానీ మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎం స్వయంగా వివరణ ఇవ్వాలని నిర్ణయించుకోవడం వెనుక బలమైన రాజకీయ, పరిపాలనాపరమైన వ్యూహం ఉంది



హైదరాబాద్

హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయికి చేర్చాలనే రేవంత్ రెడ్డి సర్కార్ సంకల్పంలో 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్' కీలకమైనది. అయితే, ప్రారంభం నుంచీ ఈ ప్రాజెక్టు విమర్శలు, రాజకీయ వివాదాలు, నిర్వాసితుల ఆందోళనల మధ్య నలిగిపోతోంది. ఈ నేపథ్యంలో, అపోహలను తొలగించి, ప్రాజెక్టు పారదర్శకతను చాటిచెప్పేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. 500 మంది నిపుణులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఈ ప్రాజెక్టు భవితవ్యాన్ని నిర్ణయించబోయే ఒక కీలక మలుపు. సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టుల వివరణను అధికారులు లేదా కన్సల్టెంట్లు ఇస్తారు. కానీ మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎం స్వయంగా వివరణ ఇవ్వాలని నిర్ణయించుకోవడం వెనుక బలమైన రాజకీయ, పరిపాలనాపరమైన వ్యూహం ఉంది. బఫర్ జోన్ పరిధిలోని - మిగతా3లో



## డొమెస్టిక్ సిలిండర్ల కోసం ఆందోళన అవసరం లేదు

- తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- డొమెస్టిక్ సిలిండర్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందీ లేదు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ, జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు

హైదరాబాద్

ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీలో వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. డొమెస్టిక్ సిలిండర్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందీ లేదన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ, జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు - మిగతా3లో

## లూజ్‌గా పెట్రోల్ అమ్మొద్దు..

- బంకులకు కేంద్రం వార్నింగ్
- దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయి
- ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్లు, డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ




## ఎల్పీజీ సరఫరాలో ఇబ్బందులు లేవు

- బుకింగ్ చేసుకున్న అందరికీ గ్యాస్ వస్తుంది: కేంద్రం
- సిలిండర్ల బ్లాక్‌మార్కెట్ అరికట్టాలని రాష్ట్రాలను కోరాం
- వాణిజ్య సిలిండర్ల విషయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాం
- కేంద్రప్రభుత్వం వివరణ



## మూసీలో మంచినీరు పారేలా చేస్తామంటే విపక్షాలు అడ్డుకోవడమేంటి

- హయత్‌నగర్‌లో రోడ్డు విస్తరణ పనులకు మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన
- విజయవాడ హైవే కోకాపేట్‌కు మించి అభివృద్ధి చెందుతుందన్న మంత్రి
- మూసి పునరుజ్జీవనం చేయాలని వెల్లడి



హైదరాబాద్

హయత్ నగర్, ఇబ్రహీం పట్నం, ఎల్బీనగర్ వాసులకు హైదరాబాద్ - విజయవాడ రహదారి విస్తరణతో కోకాపేట లాంటి డిమాండ్ రాబోతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ సిటీగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, ఇక్కడ నుండే చెన్నై, బెంగళూరు, ముంబై పూణెను కలుపుతూ హై స్పీడ్ బుల్లెట్ ట్రైన్, హైవే కారిడార్లు రాబోతున్నాయని అన్నారు. హయత్ నగర్ సాయిబాబా టెంపుల్ (తొర్రూర్ ఇ రోడ్) నుంచి జీ స్కూల్ వరకు సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో 2లేన్ నుంచి 4లేన్ రహదారిగా అభివృద్ధి చేస్తున్న పనులకు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇవాళ శంకుస్థాపన చేశారు. - మిగతా3లో

## భారత నౌకలకు హోర్ముజ్ జలసంధి మీదుగా వెళ్లేందుకు అనుమతి

- హోర్ముజ్ జలసంధి ద్వారా భారత నౌకలకు సురక్షిత మార్గం కల్పిస్తామన్న ఇరాన్
- ఈ విషయాన్ని ధ్రువీకరించి భారత్‌లోని ఇరాన్ రాయబారి
- 'భారత ప్రభుత్వానికి సహకారం అందిస్తాం' : ఇరాన్ రాయబారి





## ఎన్డీఏ కూటమితో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదు

- ఎన్డీఏతో పొత్తుపై స్పష్టత ఇచ్చిన టీవీకే
- కూటమితో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదన్న స్పష్టం
- పొత్తుపై జరుగుతున్న చర్చంతా ఊహాగానాలేనంటూ కొట్టిపారేసిన పార్టీ

## మే 11 నుంచి తొలిదశ జనాభా లెక్కలు

- ప్రభుత్వ పనితీరు మెరుగుపడేందుకు జనగణనే కీలకం
- తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారి జనగణన
- రాష్ట్రంలో 11 మే నుంచి జూన్ 09 వరకు తొలిదశ లెక్కింపు
- డిజిటల్ మోడ్‌లో జనగణన చేపట్టేందుకు ఆఫ్‌లైన్ మోడ్‌లో పనిచేసే యాప్ వినియోగం





అన్ని శాఖల్లో పురోగతి రావాలన్నా, అభివృద్ధి జరగాలన్నా, ప్రభుత్వం ఉపయోగకరమైన పాలసీలు చేయాలన్నా ముఖ్యమైనది జనగణన మాత్రమేనని జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి పేర్కొన్నారు. 2026 మే 11 నుంచి తొలిదశ జనాభా లెక్కలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మీడియా ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించడంలో మీడియా వారధిగా పని చేస్తోందని జనాభా లెక్కల విషయంలోనూ అదే విధంగా కృషి చేయాలని కోరారు. హైదరాబాద్ కోఠిలోని సెన్సస్ కార్యాలయంలో డైరెక్టర్ భారతి హోళికేరి ప్రెస్ మీట్ నిర్వహించారు. జనాభా లెక్కలు జరగనున్న విధానంపై మీడియా ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. 1872లో తొలిసారి జనాభాను బ్రిటిష్ కాలంలో లెక్కించారని, తర్వాత 1881లో తొలిసారి - మిగతా3లో

# పంజాబ్ ప్రభుత్వం కేజ్రీవాల్‌కు ఏటిఏంలా మారిపోయింది

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. భగవంత్ మాన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ఆ పార్టీ అగ్రనేత అరవింద్ కేజ్రీవాల్‌కు ఒక ఏటిఏంలా మారిపోయిందని షా ఆరోపించారు. అప్పులు, డ్రగ్స్, అక్రమ మత మార్పిడులు, అవినీతి, గ్యాంగ్‌స్టర్ల అరాచకాలతో పంజాబ్ నాశనమైందన్నారు. మాదకద్రవ్యాల సమస్య నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయగలిగే శక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీకి మాత్రమే ఉందన్నారు. శనివారం పంజాబ్‌లోని మోగా జిల్లా, కిల్లి చాహ్లాన్ గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో అమిత్ షా పాల్గొని మాట్లాడారు. పంజాబ్ ప్రజలు గతంలో కాంగ్రెస్ పార్టీకి, శిరోమణి అకాలీదళ్, ఆమ్ ఆద్మీ పార్టీకి అవకాశాలు ఇచ్చారని షా గుర్తు చేశారు. 2027లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే మాదకద్రవ్యాల వ్యాపారాన్ని సమూలంగా నిర్మూలిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

"ఈ ప్రభుత్వంలో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా ఉంది. 2026లో ముగ్గురు గ్రామ సర్పంచులు హత్యకు గురయ్యారు. గ్యాంగ్‌స్టర్లు ప్రజల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అదేవిధంగా, రాష్ట్రం పూర్తిగా మాదకద్రవ్యాల ముప్పుతో సతమతమౌతోంది. రైతులు కూడా ఎన్నో విధాలుగా నష్టపోతున్నారు. మరోవైపు, ప్రభుత్వం పూర్తిగా



అవినీతిలో మునిగిపోయింది. ఢిల్లీ నుంచి వచ్చిన నలుగురు సుబేదార్లు, రాష్ట్రంలో కూర్చొని సంపదనంతా బయటకు తరలిస్తున్నారు. భగవంత్ మాన్ కేవలం కేజ్రీవాల్‌కు పైలట్‌గా మాత్రమే వ్యవహరిస్తున్నారు."

**మాదకద్రవ్యాల వ్యాపారాన్ని అంతం చేసే ధైర్యం వారికి లేదు!**

మరోవైపు, రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి షా ప్రస్తావించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల ముప్పును అంతం చేసే ధైర్యం 'ఆప్'నకు లేదని, దాన్ని అరికట్టడంలో కాంగ్రెస్, అకాలీలు ఇప్పటికే విఫలమయ్యాయని విమర్శించారు. అయితే వాటిని రాష్ట్రం నుంచి పూర్తిగా తొలగించగలిగే వారు ఎవరైనా ఉన్నారంటే, అది కేవలం నరేంద్ర మోదీ ప్రభత్వమేనని షా వ్యాఖ్యానించారు. ఎందుకంటే, తమ ప్రభుత్వం హయాంలో జమ్ము కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశామని, ఉగ్రవాదం కూడా చివరి దశలో ఉందని, నక్సలిజం నేడు అంతిమ దశకు చేరుకుందని షా పేర్కొన్నారు. కాబట్టి, రాబోయే ఎన్నికల్లో తమను గెలిపిస్తే రెండేళ్లలో పంజాబ్‌లో మాదకద్రవ్యాల వ్యాపారాన్ని సమూలంగా నిర్మూలిస్తామని షా హామీ ఇచ్చారు.

**హామీలను నెరవేర్చిందా?**

మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల కారణంగా పరిశ్రమలు పంజాబ్‌ను విడిచిపెట్టి వెళ్లిపోతున్నాయని, ఫలితంగా నిరుద్యోగులు పెరుగుతున్నారని షా వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో మాన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను (అన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పించడం, వృద్ధాప్య పెన్షన్ మొత్తాన్ని పెంచడం) నెరవేర్చిందా అని ఆయన ప్రశ్నించారు.

ఇదిలా ఉండగా, 2027లో పంజాబ్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అమిత్ షా మాట్లాడారు. ప్రజలు తమకు ఒక్క అవకాశం ఇస్తే అంతా మార్చి చూపిస్తామన్నారు. గతంలో అకాలీదళ్ సర్కార్‌లో బీజేపీ భాగస్వామిగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు పంజాబ్ ప్రజల ఆశీస్సులు తీసుకునేందుకే తాను ఇక్కడికి వచ్చానని చెప్పారు. మోగా ప్రాంతం పంజాబ్‌లోని రాజకీయంగా అత్యంత కీలకమైన 'మల్వా బెల్ట్' పరిధిలోకి వస్తుంది. వచ్చే ఏడాది ప్రారంభంలో ఎన్నికలు జరగనున్న రాష్ట్ర అసెంబ్లీలోని మొత్తం 117 స్థానాల్లో, 69 స్థానాలు ఈ మల్వా బెల్ట్ పరిధిలోనే ఉన్నాయి.

# ఎల్పీజీ సరఫరాలో ఇబ్బందులు లేవు

ఎల్పీజీ సరఫరాలో ప్రస్తుతానికి ఇబ్బందులు లేవని కేంద్ర ప్రభుత్వం మరోసారి తెలిపింది. సిలిండర్ల విషయంలో చాలామంది ఆందోళన చెందుతున్నారని, చాలామంది అవసరం లేకున్నా బుకింగ్ చేస్తున్నారని చెప్పింది. వాణిజ్య సిలిండర్ల విషయంలో రాష్ట్రాలతో మాట్లాడుతున్నామని, ప్రాధాన్య క్రమంలో సరఫరా చేస్తున్నామని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్?ల్ భారత చమురు శాఖ సంయుక్త కార్యదర్శి(మార్కెటింగ్, ఆయిల్ రిఫైనరీ) సుజాత శర్మ పలు వివరాలు వెల్లడించారు. ఏపీలో వారిపై చర్యలు "సిలిండర్ల బ్లాక్‌మార్కెట్ అరికట్టాలని రాష్ట్రాలను కోరాం. వాణిజ్య సిలిండర్ల విషయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాం. సిలిండర్లు అక్రమంగా నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఏపీ, బిహార్, కర్ణాటక, ఒడిశాలో వాణిజ్య సిలిండర్లు నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకున్నాం. ఎల్పీజీ సరఫరాలో గృహాలు, ఆస్పత్రులు, హాస్టళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నాం. సిలిండర్ బుక్ అవడం లేదని చాలామంది ఫిర్యాదు చేస్తున్నారు. సిలిండర్ల బుకింగ్ వ్యవధి పట్టణాల్లో 25, గ్రామాల్లో 45 రోజులుగా ఉంది. సిలిండర్ల బుకింగ్ ఫోన్, ఐవీఆర్ఎస్, ఇతర విధానాల్లో చేయవచ్చు. డిస్ట్రిబ్యూటర్ల వద్దకు వెళ్లి క్యూలో ఉండనక్కర్లేదు. సిలిండర్ల అందుబాటు మేరకు సరఫరా జరుగుతూనే ఉంది. బుకింగ్ చేసుకున్న అందరికీ గ్యాస్ వస్తుంది" అని సుజాత శర్మ తెలిపారు.



**ఆ రెండు నౌకలు ఎప్పుడు వస్తాయంటే?**

"పశ్చిమ గల్ఫ్‌లోని హర్మూజ్ వద్ద 24 నౌకలు ఉన్నాయి. ఎల్‌పీజీ సరఫరా చేసే 2 నౌకలు హర్మూజ్ నుంచి బయలుదేరాయి. శివాలిక్, నందాదేవి నౌకల్లో ఎల్‌పీజీ తరలింపు జరుగుతోంది. రెండు నౌకలు ఈనెల 16, 17 తేదీల్లో ముంద్రా, కాండ్లా పోర్టులకు వస్తున్నాయి. గల్ఫ్‌లో ఉన్న భారతీయ నౌకలు క్షేమంగానే ఉన్నాయి. నౌకల్లో ఉన్న భారత సిబ్బందికి ఎలాంటి సమస్యలు లేవు. హర్మూజ్ జలసంధిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. భారత నావికుల కుటుంబసభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నాం. గడిచిన 24 గంటల్లో 30 మంది నావికులు స్వదేశానికి తరలివచ్చారు. పోర్టుల్లో సమస్యలు రాకుండా చూడాలని అధికారులను కోరాం" అని చెప్పారు. ఆ తర్వాత శివాలిక్, నందాదేవి నౌకలు సుమారు 92,700 మెట్రిక్ టన్నుల ఎల్పీజీతో దేశానికి వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు. మార్చి 16, 17 తేదీల్లో రావొచ్చని తెలిపారు. "పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలోని భారతీయ నావికులందరూ సురక్షితంగా ఉన్నారు. గత 24 గంటల్లో వారికి సంబంధించిన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. హోర్మూజ్ జలసంధికి పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్‌లో 24 భారతీయ జెండాతో కూడిన నౌకలు ఉన్నాయి. మొత్తం 611 మంది నావికులు ఉన్నారు" అని ఆయన చెప్పారు. భారతీయ సిబ్బంది భద్రతను నిర్ధారించడానికి ఓడ యజమానులతో సన్నిహిత సమన్వయంతో పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. "భారతీయ నౌకలు, అందులోని భారతీయ నావికుల పరిస్థితిని మంత్రిత్వ శాఖ, ముఖ్యంగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (ఔ+ షిప్పింగ్), ఓడ యజమానులు, ఫ్రాంచీ ఏజెన్సీలు, భారత దౌత్య కార్యకలాపాల సమన్వయంతో నిశితంగా పర్యవేక్షిస్తోంది. గత 24 గంటల్లో, షిప్పింగ్ కమ్యూనికేషన్ సెంటర్ అయిన ఔ+ కామ్ 312 ఫోన్ కాల్స్, 460 ఈమెయిల్స్‌ను అందుకుంది. ఆ కమ్యూనికేషన్‌లు నావికులు, వారి కుటుంబ సభ్యులు, సముద్ర రంగంలోని ఇతర వాటాదారుల నుంచి వచ్చాయి. గత 15 రోజులను పరిశీలిస్తే, మాకు 2,500 కంటే ఎక్కువ ఫోన్ కాల్స్, సుమారు 5,000 ఈమెయిల్స్ వచ్చాయి, వీటన్నింటికీ తగిన విధంగా స్పందన ఇచ్చాం" అని ఆయన చెప్పారు.

# ఎన్‌డీఏ కూటమితో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ త్వరలో ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ చర్చలు వేడెక్కాయి. ముఖ్యంగా దళపతి విజయ్ నేతృత్వంలోని తమిగళ వెట్రి కజగంపైనే అందిరి దృష్టి నెలకొంది. అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్?డీఏతో పొత్తు ఉంటుందని వార్తలు వస్తోన్న ఈ క్రమంలో విజయ్ పార్టీ క్లారిటీ ఇచ్చింది. ఎన్?డీఏ కూటమితో పొత్తుకు ఎటువంటి ఆస్కారం లేదని స్పష్టం చేసింది. ఈ విషయమై జరుగుతున్న చర్చలు కేవలం ఊహాగానాలు మాత్రమే అని కొట్టిపారేసింది.

టీవీకే జిల్లా కార్యదర్శులతో జరిగిన వర్చువల్ సమావేశంలో పార్టీ బలాబలాలు సహా పొత్తులపై చర్చ జరిగిందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్ తెలిపారు. ఎన్?డీఏతో పొత్తుకు అవకాశమే లేదన్న ఆయన సిద్ధాంతాల పరంగా బీజేపీ తమకు శత్రువని పేర్కొన్నారు. ఎన్నికల్లో పొత్తు పెట్టుకొని పోటీ చేస్తే విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయని జిల్లా కార్యాదర్శులు, టీవీకే ప్రధాన కార్యదర్శికి తెలియజేసినట్లు తెలిసింది. ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ఈ ప్రచారం జరుగుతోందని పేర్కొంటూ, పార్టీ సభ్యులు అధికారిక ప్రకటనలనే నమ్మాలని కోరారు.



**'తమిళనాడు ప్రజల సమస్యలపై దృష్టి'**

అటు టీవీకేతో పొత్తు గురించి తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్?ను ప్రశ్నించగా, ఆయన సూటిగా సమాధానం ఇవ్వలేదు. మీరు కూటమి గురించి ఆలోచిస్తున్నారని, తను మాత్రం తమిళనాడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే దృష్టి ఉందని చెప్పారు. ముఖ్యంగా చట్టవ్యవస్థ వైఫల్యం, మహిళల భద్రతపై ఆందోళన చెందుతున్నాని అన్నారు.

టీవీకే స్థాపన సమయంలో విజయ్ తమ ప్రధాన రాజకీయ ప్రత్యర్థి డీఎంకే అని, సిద్ధాంతపరమైన ప్రత్యర్థి బీజేపీ అని స్పష్టం చేశారు. అయితే ఎన్?డీఏ కూటమిలో చేరేందుకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్యవర్తిత్వం చేసినట్లు వచ్చిన వార్తలు వచ్చాయి. దీంతో టీవీకే--ఎన్?డీఏ కూటమి అవకాశంపై చర్చలు మళ్లీ తెరపైకి వచ్చాయి. టీవీకేను ఎన్?డీఏలో చేర్చేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్? షా కూడా ఆసక్తి చూపుతున్నారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో పార్టీ క్లారిటీ ఇవ్వడంతో పొత్తుపై స్పష్టత వచ్చింది.

**అభ్యర్థుల ఎంపికపై కసరత్తు**

ఇక ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీవీకే ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించింది. పార్టీకి వచ్చిన దరఖాస్తుల్లో నుంచి సుమారు 60 మందిని విజయ్ ఇంటర్వ్యూ చేసి కొన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులుగా ఎంపిక చేసినట్లు సమాచారం. అయితే కూటమి ఏర్పడితే ఆ సీట్లలో కొన్ని మిత్రపక్షాలకు ఇవ్వాల్సి వస్తుందా అనే అంశంపై కూడా జిల్లా నాయకుల అభిప్రాయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్?డీఏ సీట్ల కేటాయింపుపై చర్చలను ఇంకా ప్రారంభించ లేదు. ఇక అధికార డీఎంకే నేతృత్వంలోని కూటమిలో భాగమైన 21 పార్టీలతో సీట్ల కేటాయింపులపై చర్చలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే పొత్తులో భాగంగా మిత్రపక్షం కాంగ్రెస్?కు డీఎంకే 28 సీట్లు కేటాయించింది

**ఎన్నికల తేదీల కోసం ఎదురుచూపులు**

కాగా, తమిళనాడు అసెంబ్లీ గడువు మే 10న ముగియనుంది. త్వరలోనే ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశం ఉంది. ఈ ఎన్నికల్లో అధికార డీఎంకే- కాంగ్రెస్ కలిసి పోటీ చేయనున్నా యి. బీజేపీ- అన్నాడీఎంకే కలిసి పోటీ చేస్తున్నాయి. నటుడు విజయ్ కూడా బరిలోకి దిగడంతో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొంది. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్ర రాజకీయ పార్టీలతో ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కీలక సమావేశం నిర్వహించారు. ఎన్నికల తేదీల నిర్ణయంలో పండుగల తేదీలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని రాజకీయ పార్టీలు కోరాయి. దీనిని పరిశీలిస్తామని సీఈసీ హామీ ఇచ్చారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే 133 స్థానాల్లో గెలుపొందింది. కాంగ్రెస్ 18 సీట్లు, పీఎంకే 5 సీట్లు, వీసీకే 4, ఇతరులు 8 స్థానాల్లో గెలుచుకున్నాయి. డీఎంకే నేతృత్వంలోని కూటమి మొత్తం 159 సీట్లు సాధించింది. ఎన్?డీఏ 75 సీట్లు గెలుచుకుంది, అందులో అన్నాడీఎంకే 66 స్థానాల్లో విజయం సాధించింది.

## కాంగ్రెస్ విదేశీ శక్తుల కీలుబొమ్మ

సిల్చార్ (అస్సాం): ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రస్తుత తరుణంలో, దేశ ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టిస్తూ, కాంగ్రెస్ పార్టీ దేశ ప్రయోజనాలను పణంగా పెడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. అస్సాంలోని సిల్చార్ వేదికగా శనివారం జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న ఆయన, కాంగ్రెస్ పార్టీ వైఖరిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భారతదేశం సాధిస్తున్న వేగవంతమైన వృద్ధిని జీర్ణించుకోలేకపోతున్న కొన్ని అంతర్జాతీయ శక్తుల చేతుల్లో కాంగ్రెస్ పార్టీ ఒక కీలుబొమ్మగా మారుతోందని ప్రధాని ఆరోపించారు. 'ప్రస్తుతం ప్రపంచమంతటా యుద్ధ వాతావరణం నెలకొంది. ఇటువంటి క్లిష్ట సమయంలో దేశ ప్రజలపై ఆ ప్రభావం పడకుండా తమ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. అయితే బాధ్యతాయుతమైన రాజకీయ పక్షంగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్.. దేశంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. దేశం ఇబ్బందుల్లో చిక్కుకోవాలని, తద్వారా మోదీని నిందించవచ్చని వారు ఆశిస్తున్నారు' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ శనివారం ఈశాన్య రాష్ట్రాల కనెక్టివిటీని మెరుగుపరిచే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ. 22,860 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న 'షిల్లాంగ్-సిల్చార్ కారిడార్'కు భూమిపూజ చేశారు. 166 కిలోమీటర్ల మేర సాగే ఈ గ్రీన్ ఫీల్డ్ ఫోర్-లేన్ హై స్పీడ్ కారిడార్ పూర్తయితే, గౌహతి నుంచి సిల్చార్ మధ్య ప్రయాణ సమయం ప్రస్తుతం ఉన్న 8.5 గంటల నుండి కేవలం 5 గంటలకు తగ్గుతుంది. ఇదేవిధంగా ప్రధాని మోదీ సిల్చార్‌లోని చీఎ-306 పై నిర్మించే ఎలివేటెడ్ కారిడార్‌కు భూమిపూజ చేశారు.అలాగే కరీంగంజ్ జిల్లాలోని పత్తర్‌కండి వద్ద కొత్త వ్యవసాయ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అస్సాంలో వ్యవసాయ విద్య, పరిశోధనలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, విపక్షాలు కేవలం విమర్శలకే పరిమితమవుతున్నాయని ప్రధిన మోదీ అన్నారు.



## లూజ్‌గా పెట్రోల్ అమ్మొద్దు

ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పెట్రోల్, డీజిల్‌ను సీసాలు, డబ్బాలు వంటి విడి పాత్రలలో నిల్వ చేసుకోవడంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన జారీ చేసింది. అదే సమయంలో, దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇటీవల తమిళనాడులోని ఒక రిటైల్ అవుట్‌లెట్‌లో వినియోగదారుడికి లూజ్ కంటైనర్‌లో పెట్రోల్ పోసిన విషయం తమ దృష్టికి వచ్చిందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది భద్రతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, అందుకే ఆ పెట్రోల్ బంక్ లైసెన్సును తక్షణమే సస్పెండ్ చేసి, సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకున్నామని వెల్లడించింది. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో, దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్లు, డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. ఇంధనాన్ని సరఫరా చేసేటప్పుడు భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పెట్రోల్ వంటి మండే స్వభావం ఉన్న ఇంధనాన్ని అసురక్షిత పద్ధతుల్లో నిల్వ చేయడం వల్ల తీవ్రమైన అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం సూచించింది.

## 'భారత నౌకలకు హోర్ముజ్ జలసంధి మీదుగా వెళ్లేందుకు అనుమతి'

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ హోర్ముజ్ జలసంధి ద్వారా భారత్‌కు వెళ్లే నౌకలకు సురక్షిత మార్గం కల్పించనున్నట్లు భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలి స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య ఉన్న దీర్ఘకాలిక స్నేహం, ఉమ్మడి ప్రయోజనాల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. హోర్ముజ్‌లో భారత్ నౌకలకు సురక్షిత ట్రాన్సిట్ అనుమతిస్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన ఫతాలి భారత్ తమకు మంచి స్నేహితుడిని వారికి సురక్షిత మార్గం కల్పిస్తామని ధ్రువీకరించారు.



**'భారత్-ఇరాన్ మధ్య స్నేహం ప్రత్యేకం'**

భారత్, ఇరాన్ మంచి స్నేహబంధం ఉందని, రెండు దేశాలకు పరస్పర ప్రయోజనాలు ఉన్నాయని ఫతాలి తెలిపారు. భారత్ ప్రజల బాధ తమ బాధగా భావిస్తామని, అదే విధంగా ఇరానీయుల పరిస్థితిని భారత్ కూడా అర్థం చేసుకుంటుందని పేర్కొన్నారు. రెండు దేశాలకు సాధారణ ప్రయోజనాలు, ఒకే విధమైన భవిష్యత్తు ఉందని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ఇది కొనసాగుతుందన్నారు. ఈ కారణంగానే భారత్ తమకు సాయం చేస్తుందన్నారు

**'భారత ప్రభుత్వానికి సహకారం అందిస్తాం'**

ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రభుత్వానికి సహకరించాలని ఇరాన్ ఉన్నతాధికారులు తమ రాయబార కార్యాలయానికి సూచించినట్లు ఫతాలి తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత ప్రభుత్వానికి అవసరమైన సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. కాగా, తాజాగా భారత జెండాలున్న రెండు ఎల్?పీజీ (ఘా+) రవాణా నౌకలను 'స్ట్రెయిట్ ఆఫ్ హర్మూజ్' గుండా ప్రయాణించడానికి ఇరాన్ తాజాగా అనుమతించింది.

**హర్మూజ్ జలసంధి మూసివేయలేదన్న ఇరాన్ ప్రతినిధి**

పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న భద్రతా పరిస్థితుల నేపథ్యంలో భారత్, ఇరాన్ నాయకత్వం మధ్య జరిగిన సంభాషణ విజయవంతమైందని ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి అబ్దుల్ మజీద్ హాకీం ఇలాహీ తెలిపారు. రెండు దేశాల మధ్య జరిగిన చర్చలు చాలా సానుకూలంగా సాగాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, హర్మూజ్ జలసంధిని మూసివేయలేదని స్పష్టం చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితుల కారణంగా కొన్ని నౌకలు ప్రయాణించలేకపోతున్నాయని తెలిపారు. సాధారణంగా అయితే ఇరాన్ ఎప్పుడూ ఈ జలసంధిని మూసివేయాలని కోరుకోలేదని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇలాహీ అన్నారు.

**'యుద్ధాన్ని ప్రారంభించిన వారే ఆపేయాలి'**

ఇరాన్ ఈ యుద్ధాన్ని ప్రారంభించలేదని ఇలాహీ స్పష్టం చేశారు. అమెరికాతో చర్చలు కొనసాగుతుండగా, దౌత్యపరమైన ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. అయితే అకస్మాత్తుగా అమెరికా- ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడి చేశాయని ఆరోపించారు. ఈ దాడుల్లో ఇరాన్‌లో పలు పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. దేశ గౌరవం, భూభాగాన్ని రక్షించేందుకు అవసరమైతే ఏ త్యాగానికైనా సిద్ధమని పేర్కొన్నారు. ఈ యుద్ధాన్ని ప్రారంభించినవారే దాన్ని ఆపాలని, అంతర్జాతీయ నాయకులు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్?పై ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు.

**'భారత్ ప్రజలు ఇరాన్‌కు మద్దతు ఇస్తారు'**

భారత్ ప్రజలు మతభేదాలు లేకుండా న్యాయం కోసం నిలుస్తారని, ఇరాన్‌కు మద్దతు ఇస్తున్నారని ఇలాహీ అన్నారు. భారత్ సంస్కృతి, జ్ఞానం, నాగరికతకు ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. మహాత్మా గాంధీ ఆలోచనలను అనుసరించే దేశంగా భారత్ న్యాయాన్ని సమర్థిస్తుందని చెప్పారు.

**ఇరాన్ విదేశాంగ మంత్రితో జైశంకర్ ఫోన్ సంభాషణ**

మరోవైపు ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీతో మరోసారి ఫోన్‌లో మాట్లాడినట్లు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. ఈ సంభాషణలో ద్వైపాక్షిక అంశాలు, బ్రిక్స్‌కు సంబంధించిన విషయాలు చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఉద్రిక్తతల తర్వాత ఈ ఇద్దరు నేతల మధ్య ఇది నాలుగోసారి సంభాషణ కావడం గమనార్హం. ఈ చర్చల్లో సముద్ర మార్గాల భద్రత, ఇంధన సరఫరా స్థిరత్వం వంటి అంశాలు ప్రధానంగా చర్చించినట్లు విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది.

# మూసీలో మంచినీరు పారేలా చేస్తామంటే విపక్షాలు అడ్డుకోవడమేంటి

-మొదటిపేజీ తరువాయి

సోమవారం నుంచి పనులు మొదలు అవుతాయన్నారు.

డబుల్ డెక్కర్ నిర్మాణం రాబోతుంది

అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను ప్రతి రోజు హైదరాబాద్ - విజయవాడ 10లేన్ల జాతీయ రహదారి విస్తరణపై సంప్రదింపులు జరపడంతో పాటు, సమీక్షలు జరుపుతున్నామని కేంద్రం నుంచి అన్ని రకాల అనుమతులు రావడం కోసం కాస్త ఆలస్యం అయిందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో విద్యా, ఇతర పనుల నిమిత్తం ఎక్కువ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి స్థిరపడ్డ వారు ఎక్కువ ఉంటారన్నారు. గతంలో హైదరాబాద్ ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ రోడ్డు కోసం కృషి చేశానన్నారు. ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ రేడియో స్టేషన్ వరకు డబుల్ డెక్కర్ నిర్మాణం రాబోతుందని మంత్రి తెలిపారు.

నాగపూర్‌లో 8 కిలోమీటర్ల తర్వాత అతిపెద్ద డబుల్ డెక్కర్ నిర్మాణం మన ప్రాంతంలో 6 కిలోమీటర్ల వరకు నిర్మిస్తున్నాం అన్నారు. సుమారు రూ.940 కోట్లతో నిర్మిస్తున్న ఈ డబుల్ డెక్కర్ కారిడార్?లో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.200 కోట్లు చెల్లించేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. త్వరలో దీనికి సంబంధించిన సమావేశాలు ఉంటాయన్నారు. ఈ డబుల్ డెక్కర్ కారిడార్?లో పైన మెట్రో రైలు, నేషనల్ హైవే, కింద స్థానికులు వాహనాలు క్రాస్ చేసేందుకు యాక్సిడెంట్స్?కు ఆస్కారం లేకుండా వెహికిల్ అండర్ పాస్?లు ఏర్పాటు చేస్తున్నామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. వచ్చే నెలలో టెండర్లు పూర్తి చేసి రహదారి విస్తరణ పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతి తీసుకొని రైల్వే స్టేషన్ కలుపుతూ వేసే మరో రోడ్డు రూ.8 కోట్ల పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు.

**మూసి పునరుజ్జీవనం చేయాలి**

మూసీ విషజలాలతో బాధపడుతున్న 40 లక్షల మంది బాధితుల గోస చూడండని, తమ నల్లగొండ ప్రజల ఆరోగ్యం



గురించి మానవత్వంతో ఆలోచించండని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసీ విష జలాలతో 30 ఏళ్లకే 60 ఏళ్ల మనుషుల లాగా మారిపోతున్నారని, ప్రజలు కిడ్నీ, క్యాన్సర్ లాంటి భయంకర వ్యాధులతో సతమతం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ అంటేనే ఫ్లోరైడ్ జిల్లా విషపు జలాల జిల్లా అని పేరుందన్నారు. ఇక్కడి ప్రజల గోసను మానవత్వంతో అర్థం చేసుకోవాలని కోరారు. మూసి పునరుజ్జీవనం చేయాలని ఆలోచించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం భవిష్యత్ తరాలకు మేలు చేస్తుందన్నారు. దాదాపు మూడు గంటల ప్రజెంటేషన్ చూసామని, తమ నల్లగొండ ప్రజల కష్టాలు ఎలా తొలగుతాయి అనేది కళ్లకు కట్టినట్లు చూసామన్నారు.

**ఎవరెన్ని రాజకీయ విమర్శలు చేసినా**

గంగా నదిని, యమునా నదిని శుభ్రం చేస్తున్నారని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు ఇది గమనించాలని విజ్ఞప్తి చేశారు. మురికి కూపంలా ఉన్న మూసిలో మంచి నీటిని పారేలా చేస్తామంటే అడ్డు కోవడం దేనికి అని ఆయన ప్రశ్నించారు. 10 వేల మంది ఇళ్లు కోల్పోతున్నారని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తప్పకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్యం కోసం చేస్తున్న మంచి పనిని ప్రతిపక్షాలు రాజకీయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రధాన ఎజెండా అని, మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. ఎవరెన్ని రాజకీయ విమర్శలు చేసినా ప్రజల ఆరోగ్యం కోసం ఆలోచిస్తున్న ప్రభుత్వమే కావాలని కోరుకుంటారన్నారు. ప్రజల ఆరోగ్యం మాకు ప్రధానం అని దానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు.

# అడగడుగునా అడ్డంకులు... ముందుకు సాగేదెలా

-మొదటిపేజీ తరువాయి

ఇళ్ల కూల్చివేతలు, నిర్వాసితులకు పరిహారం వంటి అంశాలపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నాయి. బాధితుల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు నేరుగా ముఖ్యమంత్రే హామీ ఇస్తున్నారు అనే నమ్మకాన్ని కలిగించడం దీని ప్రధాన ఉద్దేశం. మూసీని లండన్‌లోని థేమ్స్ నది తరహాలో మారుస్తామన్న తన విజన్‌ను ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్లడం ద్వారా, అభివృద్ధి నిరోధకులు ఎవరో ప్రజలే తేల్చుకోవాలనే సంకేతాన్ని ఆయన ఇవ్వనున్నారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. ప్రాజెక్టు పట్ల ప్రభుత్వానికి ఉన్న స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వారికి వివరించడం ద్వారా నిధుల సమీకరణను సులభతరం చేసుకోవడం మరో లక్ష్యంముఖ్యమంత్రి తన ప్రజెంటేషన్‌లో ఐదు దశల్లో జరగబోయే అభివృద్ధిని వివరించనున్నారు. మొదటి దశలో చేపట్టబోయే పనులు, అందుకు అవసరమైన భూసేకరణ, రక్షణ గోడల నిర్మాణం గురించి క్లారిటీ ఇవ్వనున్నారు. 50 మీటర్ల బఫర్ జోన్ పరిధిలో ఉన్న నిర్మాణాలకు చట్టబద్ధంగా విలువ లేకపోయినా, మానవీయ కోణంలో ఇందిరమ్మ ఇళ్లు, ప్రత్యామ్నాయ స్థలాలు, ఆర్థిక సహాయం అందిస్తామని సీఎం హామీ ఇవ్వనున్నారు. బాపూఘాట్ వద్ద రూ.400 కోట్లతో నిర్మించ తలపెట్టిన 'గాంధీ సరోవర్', నది ఇరువైపులా నిర్మించబోయే ఎకనామిక్ జోన్ల గురించి విడమర్చి చెప్పనున్నారు.ప్రాజెక్టుకు మోక్షం కలగడం అనేది ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది. మేధా పాట్కర్ వంటి సామాజిక కార్యకర్తలు ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరుతున్నారు. ప్రజెంటేషన్ తర్వాత నిర్వాసితుల అనుమానాలు పటాపంచలైతేనే క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం అవుతాయి. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నేతలను ఆహ్వానించారు. ఒకవేళ ప్రతిపక్షాలు సానుకూలంగా స్పందిస్తే ప్రాజెక్టుకు రాజకీయ అడ్డంకులు తొలగుతాయి. లేనిపక్షంలో ఇది కేవలం అధికార పక్ష 'షో'గా మిగిలిపోయే ప్రమాదం ఉంది. కేవలం డిజైన్లు చూపడం కాకుండా, క్షేత్రస్థాయిలో పునరావాస పనులు ఏ మేరకు పకడ్బందీగా జరుగుతాయన్న దానిపైనే ప్రాజెక్టు విజయం ఆధారపడి ఉంటుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రజెంటేషన్ ద్వారా మూసీ ప్రాజెక్టును రాజకీయ వివాదం నుంచి అభివృద్ధి అజెండాగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది కేవలం ఒక ప్రసంగం కాదు, హైదరాబాద్ భవిష్యత్తుపై ఆయన ఇస్తున్న భరోసా. ఈ వివరణ ప్రజల్లోకి బలంగా వెళ్తే, దశాబ్దాల కాలంగా మురుగు కూపంగా మారిన మూసీకి నిజంగానే పునరుజ్జీవం లభించే అవకాశం ఉంది. ఈ ప్రెజెంటేషన్ ఒక రకంగా మూసీ ప్రాజెక్టుకు అగ్నిపరీక్ష వంటిదని చెప్పవచ్చు.

# చివరి దశకు మావోయిస్టుల పోరాటం

**వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఒక కీలకమైన అధ్యాయం అవిష్కృతంకానుంది. దశాబ్దాల కాలంగా సాయుధ పోరాట బాటలో సాగిన మావోయిస్టులు భారీ సంఖ్యలో జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధమయ్యారు. . దశాబ్దాల కాలంపాటు అజ్ఞాతంలో ఉండి, సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన మావోయిస్టు అగ్రనేతలు రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా ఆలోచన చేస్తున్నారు. జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత సీనియర్ నాయకులంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. దాదాపు గంటసేపు సాగిన సమావేశంలో మావోయిస్టు నేతలు తమ అంతరంగాన్ని ఆవిష్కరించారు. వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీ విషయం కూడా చర్చకు వచ్చింది. నాలుగున్నర దశాబ్దాల పాటు అడవిని నమ్ముకొని పోరాటం చేసిన కీలక నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవలే డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయిన మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు, సెంట్రల్ మిలటరీ కమిషన్ ఇన్‌ఛార్జి తిప్పిరి తిరుపతి(దేవ్‌జి), కేంద్ర కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డి(సంగ్రామ్), రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు (జగన్), రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి (గంగన్న) ముఖ్యమంత్రిని కలిశారు. వీరితోపాటు గతంలోనే లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యులు పుల్లూరి ప్రసాద్, పోతుల పద్మావతి కూడా ఉన్నారు. ఈ భేటీలో మావోయిస్టు నేతలు ఒక సంచలన ప్రతిపాదన చేశారు. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే సాయుధ పోరాటాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగిస్తామని పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీని రద్దు చేస్తామని దేవ్‌జి, రాజిరెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు అనుసరించిన పోరాట పంథాను వదిలి, చట్టపరంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగించాలని భావిస్తున్నట్టు వెల్లడించారు. అంతేకాకుండా, ప్రభుత్వాలు సహరిస్తే రాజకీయ పార్టీగా మార్చేందుకు కూడా సిద్ధమని వారు తెలిపారు. ఈ ప్రతిపాదనపై స్పందించిన రేవంత్ రెడ్డి, ఈ అంశం తన పరిధిలో లేదని త్వరలోనే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసినప్పుడు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తాను అని హామీ ఇచ్చారు. కేంద్రం ఓకే అంటే కేంద్ర హోంమంత్రిని ఇక్కడికి పిలిపించి, ఒక భారీ సభ ఏర్పాటు చేసి ఈ విషయాన్ని ప్రకటిస్తామని సీఎం చెప్పారు.



మావోయిస్టు నేతలు తమ పునరావాసం, ఇతర మౌలిక వసతుల గురించి ముఖ్యమంత్రి కీలక అభ్యర్థనలు చేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణమే ఆరోగ్య శ్రీ సదుపాయం కల్పించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం లొంగిపోయిన వారికి 30 ఏళ్ల క్రితం నాటి రివార్డు సొమ్మునే ఇస్తున్నారని, ఇతర రాష్ట్రాల్లో ఇది ఎక్కువగా ఉందని తెలిపారు. దీనిపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని డీజీపీని ఆదేశించారు. ఇళ్ల స్థలాలు ఇవ్వడంపై క్యాబినెట్‌లో చర్చిస్తామని, అయితే వ్యవసాయ భూమి ఇవ్వడం సాధ్యం కాదని సీఎం స్పష్టం చేశారు. ఏవైనా రాజకీయ అంశాలు ఉంటే ప్రభుత్వ సలహాదారు కేశవరావును, ఆర్థికపరమైన అంశాల కోసం వేం నరేందర్‌రెడ్డిని కలవాలని సీఎం సూచించారు. జన జీవన స్రవంతిలో కలిసిన నేతలకు ఎలాంటి భద్రతా పరమైన ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. హింస దేనికీ పరిష్కారం కాదని, ప్రజాస్వామ్య పద్ధతిలోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని ఆయన హితవు పలికారు. సమావేశం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల్‌కు చెందిన సుజాతక్కతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మల్లోజుల కోటేశ్వరరావు భార్య అయిన ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు, వారికి ప్రభుత్వం తరపున అందే పునరావాస ప్యాకేజీలు, ఈ పరిణామం వెనుక ఉన్న కీలక అంశాలను సీఎం వివరించే అవకాశం ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, లొంగిపోయే మావోయిస్టులకు ప్రభుత్వం తక్షణ సహాయంతో పాటు, వారు సమాజంలో గౌరవప్రదంగా బతకడానికి అవసరమయ్యే ఉపాధి, ఇతర వసతులను కల్పిస్తుంది. ముఖ్యమంత్రి స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా, హింసను వీడి వచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని బలమైన సందేశాన్ని పంపాలని భావిస్తున్నారు.

## మే 11 నుంచి తొలిదశ జనాభా లెక్కలు

-మొదటిపేజీ తరువాయి

సింక్రోనస్ సెన్సెస్ (సమకాలిక జనాభా లెక్కలు) జరిగాయని చెప్పారు. 1951లో తొలిసారి స్వాతంత్ర్య భారత్‌లో జనగణన జరిగిందని తెలిపారు. 2027లో జరగనున్న ఈ జనగణన స్వాతంత్ర్య భారత్‌లో ఎనిమిదోసారి, మొత్తంగా 16వదని గుర్తు చేశారు.

డిజిటల్ మోడ్‌లో జనగణన

కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాల సహకారంతో ఫెడరల్ స్ఫూర్తితో జనగణన జరుగుతోందని వివరించారు. రాష్ట్రంలో సీఎస్, నోడల్ ఆఫీసర్, ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్, ఛార్జ్ ఆఫీసర్‌తో పాటు ఎన్యుమరేటర్స్, సూపర్వైజర్లు దీనిలో పాల్గొంటారని తెలిపారు. ఇందులో సేకరించిన సమాచారాన్ని పూర్తిగా భద్రంగా ఉంటుందని, దుర్వినియోగం చేసే అవకాశం ఉండదని హామీ ఇచ్చారు. ఎన్యూమరేటర్లు ఎవరైనా అతిగా ప్రవర్తిస్తే మూడు నెలల వరకు జైలుశిక్షతో పాటు జరిమానా ఉంటుందని హెచ్చరించారు. ఈసారి పూర్తిగా డిజిటల్ మోడ్‌లో జనగణన చేపట్టేందుకు ఆఫ్‌లైన్ మోడ్‌లో పని చేసే యాప్‌ను ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు.

"తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో జరగనున్న తొలి జనగణన జరగనున్న నేపథ్యంలో అందరూ సహకరించాలి. రాష్ట్రంలో 11 మే నుంచి జూన్ 09 వరకు తొలిదశ లెక్కింపు జరుగుతుంది. హౌస్ హోల్డింగ్ లెక్కింపులో ప్రతి బిల్డింగ్ సహా పూరి గుడిసెలకు నెంబర్ ఇస్తాం. ఇందులో సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు 2026 ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు అవకాశం కల్పిస్తున్నాం. 2వ దశలో జనాభా లెక్కింపు 2027 ఫిబ్రవరి 9 నుంచి 28 వరకు జరుగుతుంది. 2027 ఫిబ్రవరి 28 రాత్రి నిరాశ్రయుల లెక్కింపు ఉంటుంది" - భారతి హోళికేరి, జనగణన డైరెక్టర్

రివిజన్ రౌండ్‌లో 33 ప్రశ్నలు : 2027 మార్చ్ 01 నుంచి 05 వరకు రివిజన్ రౌండ్ ఉంటుందని భారతి పేర్కొన్నారు. మొదటి దశలో 33 ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. వాటిలో 1-14 వరకు ఆ బిల్డింగ్ స్థితిగతులు, 15-24 నుంచి మౌలిక వసతులు, 25-31 వరకు ఇంట్లో ఉండే చిన్న చిన్న ఆస్తులకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయని పేర్కొన్నారు. 32లో ఆహార అలవాట్లు, 33లో మొబైల్ నెంబర్ ఉంటాయన్నారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసిన తర్వాత ఎడిట్ ఆప్షన్ కూడా ఉంటుందని పేర్కొన్నారు.

ప్రీటెస్ట్ విజయవంతం

సన్నద్ధతలో భాగంగా హౌస్‌లిస్టింగ్ అండ్ హౌస్ సెన్సెస్ ఆపరేషన్‌లో భాగంగా 2025 నవంబర్ 10 నుంచి 30 వరకు ప్రీటెస్ట్ నిర్వహించినట్లు భారతి తెలిపారు. దీనికోసం జీహెచ్ఎంసీ పరిధిలో 22వ సర్కిల్ 112వ వార్డ్?లో, నల్గొండ జిల్లాలో తిప్పర్తి, ఏజెన్సీ ఏరియాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పినపాకను ఎంచుకుని విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. 2027లో జరగనున్న జనగణన కోసం లెవల్ 1లో ఇద్దరు నేషనల్ ట్రైనర్స్ ఉంటారు. లెవల్ 2లో 66 మంది మాస్టర్ ట్రైనర్స్, లెవల్ 3లో 1220 మంది ఫీల్డ్ ట్రైనర్స్, ఛార్జ్ క్లర్క్ అండ్ టెక్నికల్ అసిస్టెంట్ ట్రైనింగ్ 3,728, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు కలిసి 88,470 మంది ఉన్నారని తెలిపారు. ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారిగా ఉండే వ్యక్తి ఆ జిల్లాలో జరిగే లెక్కింపుపై పూర్తి అధికారం కలిగి ఉంటారని చెప్పారు. ఎన్యూమరేటర్లు తప్పు సమాచారం సేకరించవద్దని, ఏదైనా తప్పు ఉంటే ఎడిట్ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సరైన సమయంలో క్వాలిటీ డాటా ఇవ్వడమే ఎన్యుమరేటర్ల ప్రధాన కర్తవ్యమని తెలిపారు.

అవాస్తవాలను నమ్మొద్దు

దేశంలో అక్రమంగా ఉన్న రోహింగ్యాలు కూడా జనాభా లెక్కల్లో ఉంటారని విదేశాల్లో పని కోసం వెళ్లినవారు ఈ లెక్కల్లో ఉండరని తెలిపారు. ఇవి భారత పౌరసత్వాన్ని నిర్ణయించే లెక్కలు కావని కేవలం జనాభా ఎంత ఉందో తెలుసుకోవడానికి చేస్తున్నందున ప్రజలంతా అవాస్తవాలను నమ్మొద్దని కోరారు. సమాచారం గోప్యంగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## డొమెస్టిక్ సిలిండర్ల కోసం ఆందోళన అవసరం లేదు

-మొదటిపేజీ తరువాయి

చేసినట్లు చెప్పారు. ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో శనివారం మంత్రి ఉత్తమ్ సమావేశమయ్యారు. తాజా పరిస్థితులపై అసోసియేషన్ ప్రతినిధులు మంత్రితో చర్చించారు. అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 810 మంది ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు, 1.3 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారని చెప్పారు. "28 లక్షల మంది దీపం పథకం కింద ఎల్‌పీజీ వినియోగిస్తున్నారు. 7.5 లక్షల మంది కమర్షియల్ సిలిండర్లు వాడుతున్నారు. ప్రతినెలా డొమెస్టిక్ సిలిండర్లు 58 నుంచి 60 లక్షల సిలిండర్లు వాడుతున్నాం. కమర్షియల్ సిలిండర్ల పంపిణీ కొరత ఉంది. ఎల్‌పీజీ సిలిండర్లు గత కొద్ది రోజులుగా సాధారణం కంటే రెట్టింపు బుక్ అవుతున్నాయి. కమర్షియల్ సిలిండర్లు అవసరమైన సంఖ్యలో రోజుకు కేవలం 20శాతం మాత్రమే పంపిణీ చేయగలుగుతున్నాం. గృహ అవసరాలకు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. గతంలో రోజుకు 2.15 లక్షల డొమెస్టిక్ సిలిండర్లు పంపిణీ చేసేవాళ్లం. గత రెండు రోజులుగా 2.3 లక్షలు సప్లై చేస్తున్నాం. గతంలో కమర్షియల్ సిలిండర్లు రోజుకు 23వేలు డిస్ట్రిబ్యూట్ చేసేవాళ్లం, కానీ, ప్రస్తుతం రోజుకు 6 వేలు మాత్రమే సప్లై చేయగలుగుతున్నాం" అని ఉత్తమ్ వివరించారు.

## శక్తివంతంగా మారుతున్న తెలంగాణ జాగృతి



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఒక అనూహ్య మార్పు కనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ ప్రధాన నేతలు ఇంకా ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కొంత తడబడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. తాము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా మారలేకపోతున్నాం అని గతంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అయితే, సరిగ్గా ఇక్కడే కల్వకుంట్ల కవిత తనదైన శైలిలో రాజకీయ దూకుడు పెంచారు. బీఆర్ఎస్ పార్టీ కంటే వేగంగా ఆమె క్షేత్రస్థాయి సమస్యలపై స్పందిస్తూ, ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్ల గ్రామంలో పేదల ఇళ్ల కూల్చివేతపై కవిత చేసిన పోరాటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణం ?వుతోంది. నిరాశ్రయులైన కుటుంబాల కోసం ఆమె ఏకంగా ఖమ్మం నడిబొడ్డున ఆమరణ నిరాహార దీక్షకు దిగడం, పోలీసుల నిర్బంధాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడటం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బీఆర్ఎస్ కేడర్ అంతా స్తబ్దుగా ఉన్న తరుణంలో, ఆమె నేరుగా గ్రౌండ్ లెవల్‌లోకి వెళ్లి బాధితులకు భరోసా ఇవ్వడం ద్వారా అటు పార్టీ శ్రేణుల్లో, ఇటు ప్రజల్లో ఆమెపై సానుభూతి , మద్దతు పెరుగడానికి కారణం అయింది.ఢిల్లీ లిక్కర్ కేసు నుండి విముక్తి పొందిన కవిత తెలంగాణ జాగృతి వేదికగా తన రాజకీయ పునరాగమనాన్ని అత్యంత శక్తివంతంగా చాటుకుంటున్నారు. తనను పార్టీ నుండి పంపేశారని చెబుతున్న ఆమె చేస్తున్న పోరాటాలు చూస్తుంటే.. బీఆర్ఎస్ చేయలేని పనిని ఆమె ఒంటిచేత్తో చేస్తున్నట్లు కనిపిస్తోంది. కేసీఆర్, కేటీఆర్ వంటి అగ్రనేతలు ఇంకా వ్యూహాల్లో నిమగ్నమై ఉండగా, కవిత మాత్రం నేరుగా యాక్షన్ లోకి దిగడం బీఆర్ఎస్‌కు షాక్ లాంటిదే. కవిత ఇప్పుడు తన 'తెలంగాణ ఉద్యమ కాలం' నాటి పంథాను మళ్లీ ఎంచుకున్నారు. అప్పట్లో జాగృతి ద్వారా ఎలాగైతే ప్రజలను సమీకరించారో, ఇప్పుడు కూడా అదే ఫార్ములాతో వెళ్తున్నారు. చట్టసభల్లో గొంతుక కంటే.. వీధుల్లో చేసే పోరాటమే బలంగా వినిపిస్తుంది అనే సిద్ధాంతాన్ని ఆమె పాటిస్తున్నారు. జగదీష్ రెడ్డి చెప్పినట్లుగా పార్టీ ఇంకా ప్రతిపక్ష పాత్రకు అలవాటు పడకపోవచ్చు కానీ, కవిత మాత్రం ఇప్పటికే ఆ పాత్రలో ఒదిగిపోయారు. ప్రజా సమస్యలపై ఆమె చూపిస్తున్న ఈ తెగువ, కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు ఆమెకు ప్రజల మద్దతును మరింత పెంచుతున్నాయి. భవిష్యత్తులో బీఆర్ఎస్ కేడర్ కూడా ఆమె నాయకత్వం వైపు మొగ్గు చూపినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. కేటీఆర్ కూడా వెంటనే.. ప్రెస్మీట్లు, సోషల్ మీడియా విమర్శలకే పరిమితం కాకుడా.. ప్రత్యక్షంగా రాజకీయ యుద్ధాలకు దిగాలన్న అభిప్రాయం బీఆర్ఎస్ క్యాడర్ లో వినిపిస్తోంది.

వాస్తవ నేస్తం

STATE NEWS

శనివారం 14 మార్చి 2026



# ఆర్‌వోబీ ఆగమాగం

**రెండు నెలలుగా మూసివేసిన తాంసి బస్టాండ్ గేటు**

**రైతులు, జనం ఇబ్బందులు.. నష్టపోతున్న వ్యాపారులు**




**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వే క్రాసింగ్‌ల వద్ద వాహనదారుల ఇబ్బందులను తొలగించడంతోపాటు ట్రాఫిక్ సమస్య నివారణకు చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల్లో జాప్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.97.20 కోట్ల అంచనాతో చేపట్టారు. ఇందులో రాష్ట్రం వాటా రూ.57.20 కోట్లు కాగా, కేంద్రం వాటా రూ.39.4 కోట్లుగా నిర్ణయించారు. వంతెన పొడువు 931.825 మీటర్లు కాగా మూడున్నర సంవత్సరాల కిందట పనులు ప్రారంభమయ్యాయి. రైల్వే ట్రాక్ భాగంలోని పనులను రైల్వేశాఖ, మిగత పనులను రోడ్లు అండ్ భవనాల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పనులు సకాలంలో పూర్తి చేయాల్సి ఉండగా.. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా తీవ్ర జాప్యం జరుగుతున్నది. దీంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. +వశీస్త్రతీఖుజూష్త్రఅష =వటవతీవఅషవ

**రెండు నెలలుగా గేటు మూసివేత**

తాంసి బస్టాండ్ వద్ద రైల్వే కింద వంతెనను రూ.20 కోట్లతో నిర్మాణ పనుల చేపట్టాల్సి ఉండగా.. రెండు నెలల కిందట తాంసి బస్టాండ్ వద్ద గేటును అధికారులు మూసివేశారు. అప్పటి నుంచి పనులు చేపట్టకపోవడంతో ప్రజలు, రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే గేటు సమీపంలో మార్కెట్ యార్డు ఉండడంతో రైతులు పంటలు విక్రయించడానికి వస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు జరుగుతుండడంతో రైతులు ఆర్టీవో కార్యాలయం మీదుగా ఐదు కిలోమీటర్ల దూరం నుంచి వెళ్లాల్సి వస్తుంది. గేటుకు అవతలి పక్కన భాగ్యనగర్, తాటిగూడ, క్రాంతినగర్, ఇంద్రనగర్, గడియార్ మహేల, గాంధీనగర్, అమన్‌కాలనీతోపాటు ఇతర ప్రాంతాలున్నాయి.తాజా తెలుగు వార్తలు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలతోపాటు తాంసి, భీంపూర్ మండలాలకు వెళ్లాల్సిన వాహనాలు ఇక్కడి నుంచి వెళ్లాల్సి వస్తున్నది. రెండు నెలలుగా గేటు మూసివేయడంతో ఎలాంటి పనులు జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌కు, ఇతర పనుల కోసం రావాలంటే రెండు ఆటో ఛార్జీలు చెల్లించాల్సి వస్తుందని అంటున్నారు. తాంసి బస్టాండ్ ప్రాంతంలో రెండు వందలకు పైగా వ్యాపారులు ఉపాధి పొందుతారు. గేటు మూసివేసిన ఫలితంగా జనాలు రాకపోవడంతో వారి వ్యాపారులు నిలిచిపోయి ఉపాధి నష్టపోతున్నారు. పనులను ప్రారంభించాలని లేదా గేటును ఓపెన్ చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను పలుమార్లు కోరినా ఫలితం లేదని ప్రజలు అంటున్నారు. రైల్వే గేటూ మూసివేత విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని కోరుతున్నారు.

# మొరంపై కన్ను అధికారులే దన్ను

**జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు**

**పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు**

**యథేచ్ఛగా తరలుతున్న మట్టి**




**సారంగాపూర్ :** ప్రభుత్వ భూములు, గుట్టలపై అక్రమార్కులు కన్నేశారు. అక్రమంగా మొరం మట్టి తరలించి జేబులు నింపుకొంటున్నారు. రెవెన్యూ, మైనింగ్ యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని జామ్ కరిశలగుట్ట, సారంగాపూర్‌లోని అంబవాయి చెరువు, దేవుల్లగుట్ట, బీరవెల్లి గుట్ట, స్వర్ణలో అటవీ, ప్రభుత్వ భూముల నుంచి శని, ఆదివారాలు అక్రమార్కులు మొ రం మట్టిని తరలిస్తున్నారు. మై నింగ్‌శాఖ అనుమతి తప్పనిసర న్న నిబంధన ఉన్నా.. దానిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు తవ్వకాలు జరుపుతున్నారు. గ్రామంలో మొరం మట్టి ఒ క్కొక్క ట్రాక్టర్‌కు రూ.350 నుంచి రూ.400, దూరప్రాంతాలకు అయితే రూ.1000 నుంచి రూ.2వేలు, టిప్పర్ మట్టికి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. నిత్యం లక్షల విలువ చేసే మట్టిని తరలిస్తుండడం గమనార్హం. అధికారుల కళ్లేదుట మట్టి దందా జరుగుతున్న అడ్డుకొనే వారే లేరు.

**గుట్టలు, చెరువులు ఖాళీ**

సారంగాపూర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పునాదులు నింపేందుకు మట్టి అవసరం. రోజు ఇళ్ల నిర్మాణాలకు వందకుపైగా ట్రాక్టర్లు తరలిపోతున్నాయి. గ్రామాల్లో గుట్టలు కరిగిపోతున్నాయి. ప్రభుత్వ భూములు, చెరువుల్లో పెద్ద గుంతలు ఏర్పుతున్నాయి. దీంతో ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మొరంమట్టి రవాణాకు కొందరు అక్రమార్కులు జేసీబీలు, ట్రాక్టర్లును కొనుగోలు చేయడం గమనార్హం. మొరం మట్టి పెద్ద మొత్తంలో అక్రమ రవాణ జరుగుతున్న అధికారులు మూమూళ్ల మత్తులో మునిగి తేలుతున్నరన్న ఆరోపణలు గుప్పుమంటున్నారు. అధికారులు పట్టించుకొని మొరం మట్టి దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**మైనింగ్ శాఖ అనుమతి ఇవ్వాలి..**

మొరం తవ్వకాలకు మైనింగ్‌శాఖ అధికారులు పర్మిషన్ ఇవ్వాలి. మొరం అవసరం ఉన్న వారు దరఖాస్తు పెట్టుకుంటే మైనింగ్ శాఖ అధికారులకు పంపుతాం. అక్కడి నుంచి పర్మిషన్ వస్తే మొరం తవ్వుకోవడానికి వీలు ఉంటుంది. సారంగాపూర్ మండలంలోని మొరం తరలించడానికి ఎలాంటి అనుమతులు లేవు. మొరం మట్టి అక్రమ దందాను అరికట్టడానికి చెక్‌పోస్టులు పెట్టాం. -- సంధ్యారాణి, తహసీల్దార్, సారంగాపూర్.

# ఇంకా పక్షం రోజులే..

# ఏదులాపురం మున్సిపాలిటీ లక్ష్యం చేరుకునేనా ?




**ఖమ్మం :** 2025-26 సంవత్సరానికి గాను మున్సిపల్ రాష్ట్ర శాఖ నిర్దేశించిన లక్ష్యం ఏదులాపురం మున్సిపాలిటీ చేరుకునేనా అనే సందేహం మున్సిపల్ సిబ్బందిలో వ్యక్తం అవుతుంది. రాష్ట్ర శాఖ నిర్దేశించిన గడువు మరో పక్షం రోజులు మాత్రమే ఉండడంతో ఈ మేరకు టార్గెట్ చేరుకునేందుకు మున్సిపల్ యంత్రాంగం మల్లగుల్లాలు పడుతుంది. ముఖ్యంగా ఇంటి పన్ను వసూలు, ట్రేడ్ లైసెన్సుల జారీ, త్రాగునీటి నల్లాల ఆన్‌లైన్ వంటి నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకుగాను సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. 2025 మార్చి నుండి 2026 మార్చి వరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ఏదులాపురం మున్సిపాలిటీకి ఇంటి పన్నులకు సంబంధించి రూ.8.21 కోట్లను టార్గెట్ పెట్టడం జరిగింది. పాత పంచాయతీల పన్నువసూళ్లను ఆధారంగా లక్ష్యాన్ని ఇచ్చారు. అయితే నేటి వరకు రూ.4.18 కోట్ల ఇంటి పన్నులు వసూలు కావడం జరిగింది. అంటే దాదాపుగా 47 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకోవడం జరిగినట్లు అయింది. 100కు 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాలు జారీ చేయడంతో మిగిలిన పక్షం రోజుల్లో రూ.4.20 కోట్ల నిధులను ఇంటి పన్నులను వసూలు చేయాల్సి ఉంది.

దీనికి తోడు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 340 వ్యాపార సముదాయాలు ఉన్నట్లు గుర్తించినప్పటికీ వాటిలో కేవలం 200 వ్యాపార సముదాయాలకు మాత్రమే ట్రేడ్ లైసెన్సులు జారీ చేయగా మరో 140 వ్యాపార సముదాలకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయాల్సి ఉంది. వీటితో పాటు మున్సిపాలిటీ పరిధిలో 32 వార్డుల్లో కలిపి అధికారుల గణాంకాల ప్రకారం 6,700 త్రాగునీటి నల్ల కలెక్షన్లు ఉండగా నేటి వరకు కేవలం 3 వేల నల్లాలను మాత్రమే ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఇలా అనేక ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలకు దూరంగా ఉండటం ప్రస్తుతం మున్సిపల్ అధికారులు, సిబ్బందిని ఆలోచనలోకి నెట్టేసింది. ప్రధానంగా మున్సిపాలిటీ సిబ్బంది సరిపడా లేకపోవడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కోవడం జరుగుతుంది.

**తీవ్రంగా వేధిస్తున్న సిబ్బంది కొరత**

ప్రస్తుత 32 వార్డుల మున్సిపాలిటీ పరిధిగాను కనీసం 72 మంది వివిధ సెక్షన్లలో కలిపి ఉద్యోగులు సేవలు అందించాల్సి ఉండగా కేవలం 12 మంది మాత్రమే సేవలు కొనసాగిస్తున్నారు. దీంతో అనేక పన్ను వసూలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన మేర ముందుకు సాగడం లేదు. 32 వార్డులకు గాను 32 మంది వార్డ్ ఆఫీసర్లు ఉండాల్సి ఉండగా కేవలం ఐదు ఆరుగురితో మాత్రమే నెట్టుకొస్తున్నారు. వీరికి సైతం ఇతర అనేక సెక్షన్లు అప్పగించడంతో ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కు అన్నట్లు మున్సిపల్ నిర్వహణ కొనసాగుతుంది. ఏది ఏమైనా అత్యంత రెవెన్యూ గల మున్సిపల్ కావడం పన్ను చెల్లింపులకు ప్రజల నుండి మంచి స్పందన సైతం కనబడుతున్నప్పటికీ పన్ను వసూలు చేసే సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఈ ఆర్థిక సంవత్సరానికి మున్సిపాలిటీ టార్గెట్ రీచ్ అవుతుందా లేదా అనేది వేచి చూడాలి.

## రాబరీ కేసులో నలుగురు అరెస్టు

## రూ.13.35 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

**సూర్యాపేట :** రాబరీ కేసు సూర్యాపేట జిల్లా సిసిఎస్, ఆత్మకూరు పోలీసులు ఛేదించారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసారు. నిందితులపై తొమ్మిది కేసులు వున్నట్లు గుర్తించారు. కేసు వివరాలు అరెస్టు వివరాలను జిల్లా ఎస్పీ నరసింహ వెల్లడించారు. నిందితులు కంచుకొమ్ముల సంతోష్, కంచుకొమ్ముల గణేష్, షేక్ నశ్రీన్, కంచుకొమ్ముల సాయికిరణ్ ఒక ముఠాగా ఏర్పడి ఆటోలను దొంగలించి ప్రయాణం చేస్తూ ఒంటరిగా ప్రయాణిస్తున్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుంటారు. వృద్ధ మహిళ ను బెదిరించి ఆభరణాలు దొంగలించడం, దొంగలించిన ఆటోలోనే తిరుగుతూ రాత్రివేళ తాళాలు వేసిన ఇండ్లలో దొంగతనం చేస్తారని అన్నారు. సూర్యాపేట కోదాడ ప్రాంతాలకు చెందిన వీరు ముఠాగా ఏర్పడి ఈనెల 6 తేదీన ఆత్మకూర్ ఎస్ మండల పరిధిలోని కోటి నాయక్ తండ శివారులో ఒక వృద్ధురాలిని ఆటోలో ఎక్కించుకుని కొంత దూరము తీసుకువెళ్లి వృద్ధురాలని చంపుతామని బెదిరించి ఆమె నోరు మూసి ఆమె మెడలో ఉన్న వెండి గొలుసు దొంగలించుకున్నారు. దీనిపై ఆత్మకూరు పోలీస్ స్టేషన్ లో రాబరీ దొంగతనం కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జిల్లా సిసిఎస్ పోలీసులు ఆత్మకూరు పోలీసులు నేరానికి పాల్పడ్డ వారిని టెక్నాలజీ ద్వారా గుర్తించి శనివారం ఉదయం 6 గంటల సమయంలో ఆత్మకూరు మండల పరిధిలోని ఎనుబాముల గ్రామ స్టేజీ వద్ద సిసిఎస్ ఇన్స్పెక్టర్, ఆత్మకూరు ఎస్సై ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుకున్నారు. నిందితులనుంచి 3 లక్షల విలువైన 18 గ్రాముల బంగారం, 5 లక్షల విలువైన 1.5 కేజీల వెండి మరియు 4 లక్షల విలువైన 3 ఆటొలు, 50 విలువైన ట్యాబ్, ల్యాప్ టాప్, 1 బైకు, 1 టీవి, 2 సెల్ ఫోన్లు సీజ్ చేసారు.

## విట్ట శ్రీనివాస్ రెడ్డి అంతిమయాత్రలో

## ఎమ్మెల్యే మేఘారెడ్డి.

**వనపర్తి :** తన చివరి మజిలీకి శ్రీనివాస్ రెడ్డి ని భుజాలపై మోసిన ఎమ్మెల్యే.కన్నీటి పర్యంతమై కడసారి వీడ్కోలు చెప్పారు.తెలియని పాశం వెంటపడి రుణం తీర్చుకోమంటుంది నీ భుజం మార్చుకోమంటుంది అని ఆనాడు ఆచార్య ఆత్రేయ రాసిన గీతం నేటికీ ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టిస్తుంది.సరిగ్గా అలాంటి సన్నివేశమే నేడు పెద్దమందడి మండలం అమ్మపల్లి లో చోటుచేసుకుంది.ఎంతో మంది మదిలో సుస్థిర స్థానం సంపాదించుకొని ప్రజా నాయకుడిగా పేరొంది అశువులు బాసిన నాయకుడి అంతిమయాత్రలో ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొని శ్రీనివాస్ రెడ్డి పాడేమోశారు×బిశ్రీనివాస్ రెడ్డి మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం రాత్రి అమ్మపల్లి చేరుకునీ ఆయన మృతదేహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.శనివారం ఉదయం 10 గంటలకు అమ్మపల్లి చేరుకొని ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.మూడు, నాలుగు గంటల పాటు అక్కడే ఉన్న ఎమ్మెల్యే ఆయన పాడె మోసి కన్నీటితో చివరి వీడ్కోలు పలికారు.ఆస్తుల కంటే ఆప్తులను సంపాదించుకోవడమే అసలైన జీవితం అని శ్రీనివాస్ రెడ్డి అంతిమ యాత్ర కనులకు కట్టినట్లుగా చూపించిందంటూ ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు

## మార్చి 26 నుంచి ఆర్టీసీ సమ్మె

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సిబ్బంది ఆందోళన బాట పట్టనున్నారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందంటూ కార్మిక సంఘాలు సమ్మె సైరన్ మోగించాయి. మార్చి 13న డెడ్‌లైన్ విధించినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో శుక్రవారం ఆర్టీసీ యాజమాన్యానికి జాయింట్ యాక్షన్ కమిటీ అధికారికంగా సమ్మె నోటీసును అందజేసింది. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై గత నెలలోనే ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. మార్చి 13లోగా పరిష్కారం లభించకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని, ఆపై సమ్మెకు దిగుతామని స్పష్టం చేశాయి. అయితే ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో కదలిక లేకపోవడంతో ఆర్టీసీ ఎండీ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు, అలాగే కార్మిక శాఖ కమిషనర్‌కు నాయకులు సమ్మె నోటీసులు అందజేశారు. చట్టప్రకారం 14 రోజుల నోటీసు పిరియడ్ తర్వాత అంటే మార్చి 26 తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బస్‌లు నిలిపివేసి సమ్మె ప్రారంభించనున్నట్టు జేఏసీ స్పష్టం చేసింది. ఆర్టీసీ జేఏసీ నేతృత్వంలో మొత్తం 31 డిమాండ్లతో కూడిన నివేదికను యాజమాన్యానికి సమర్పించారు. ఇందులో ఆర్థికపరమైన అంశాలతోపాటు సంస్థ మనుగడకు సంబంధించిన కీలక డిమాండ్లు ఉన్నాయి. ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేసి, పని చేస్తున్న ఉద్యోగులందరికీ ప్రభుత్వ ఉద్యోగుల హోదా కల్పించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2017 నాటి వేతన సవరణను అమలు చేసినప్పటికీ , దానికి సంబంధించిన ఎరియర్స్‌ను ఇంకా చెల్లించలేదు. సుమారు 2,150 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కార్మికులు కోరుతున్నారు. 2021 నాటి వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో తక్షణమే ప్రకటించి, అమలు చేయాలని జేఏసీ డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీకి రావాల్సిన నిధుల్లో కోత విధిస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. నెలకు 350 కోట్ల చొప్పున ఎటువంటి మినహాయింపులు లేకుండా ఆర్టీసీకి చెల్లించాలని వారు కోరుతున్నారు. గత ప్రభుత్వం నుంచి రావాల్సిన 2500 కోట్ల పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సంస్థను కాపాడుకోవడంలో భాగంగా ఈవీ బస్‌ల నిర్వహణపై జేఏసీ కీలక వ్యాఖ్యలు చేసింది. ఎలక్ట్రిక్ బస్‌లను ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా, ఆర్టీసీ ద్వారానే నడపాలని, తద్వారా సంస్థ ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించింది. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన తర్వాత బస్సుల్లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. దీని వల్ల కండక్టర్లు, డ్రైవర్లపై పని భారం అధికమైందని, దీనిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు. మరోవైపు ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసి, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. దీని వల్ల కార్మికులకు తమ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు ఒక ప్రజాస్వామ్య వేదిక లభిస్తుందని వారు భావిస్తున్నారు.

## నందిమేడారంలో ఘనంగా

## గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు



**ధర్మారం :** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని నంది రిజర్వాయర్ సమీపాన శనివారం గంగ పుత్రుల ఆరాధ్య దైవం శ్రీ గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నూతనంగా శ్రీ గంగమ్మ తల్లి గుడిని నిర్మించారు. ఈ క్రమంలో స్థానిక గంగపుత్ర సంఘం, శ్రీ గంగాదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. ఉత్సవాలు ఈ నెల 12 నుంచి ప్రారంభమైనాయి. దీంతో ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం నూతనంగా నిర్మించిన గుడిలో శ్రీ గంగమ్మ తల్లి విగ్రహాన్ని అంగరంగ వైభవంగా ప్రతిష్టించారు. శ్రీ గంగమ్మ తల్లి తో పాటు గణపతి, శివలింగం పార్వతి, నందీశ్వరుడు, మకరం దేవి విగ్రహాలను కూడా గుడిలో ప్రతిష్టించారు. శ్రీ గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు సమర్పించారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com